క్లుప్తంగా

నేతల ఐక్యతతోనే బహుజన రాజ్యం

● పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనులకు రాజ్యాధికార ఆకాంక్ష ప్రతి కుటుంబంలో రావాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం ఓయూలో బీఎస్‌ఎఫ్ అధ్యక్షులు బొర్రెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం కొందరితో సాధ్యం కాదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలను పూలే, అంబేడ్కర్, కాన్షీరాం ఆలోచన విధానంతో చైతన్య పర్చాలన్నారు. రాజ్యాధికారానికి రానివ్వకుండా కొన్ని శక్తులు బహుజనుల గొంతు నొక్కేందుకు వ్యవహరిస్తున్నాయన్నారు. బహుజన రాజ్యం కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, డీఎస్పీ అధినేత విశారదన్ మహారాజ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇతర సంఘాల నేతలు ఏకం కావాలన్నారు. ఏప్రిల్ 3, 4 తేదీల్లో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ, 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా బ్లూ మార్చ్, మే చివరి వారంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గాదె వెంకట్, చంద్రునాయక్, శ్రీకృష్ణ, ఎల్లన్న, బొట్టు శ్రీను పాల్గొని ప్రసంగించారు.

పరామర్శ



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ సీ–క్లాస్‌లో జరిగిన అగ్నిప్రమాద బాధితులను బుధవారం బీజేపీ నాయకులు ఉమేష్ ఖండెల్వాల్, స్పందన, సురేష్, లక్ష్మణ్, లక్ష్మి, రమేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధితులను ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు. అనంతరం నిత్యావసరాలు అందజేశారు.

‘చలో రాజ్‌భవన్’కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సనత్‌నగర్: ఏఐసీసీ ఆదేశాల మేరకు పీసీసీ ఇచ్చిన పిలుపుతో సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ‘చలో రాజ్‌భవన్’ కార్యక్రమానికి తరలివెళ్లారు. ముందుగా గాంధీభవన్‌కు చేరుకుని అక్కడి నుంచి రాజ్‌భవన్ ర్యాలీలో పాల్గొన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి వినయ్‌రెడ్డితో కలిసి నేతలు ర్యారమేష్, తోట మణిమాల, కమల్‌రాజ్ తదితరులు తరలివెళ్లారు.

బోగస్ ఓట్లు తొలగించడం హర్షం

కంటోన్మెంట్: ఆరో వార్డు పరిధిలో విచారణ చేపడుతున్న కొద్ది బోగస్ ఓట్లు వెల్లడవుతున్నాయని బీజేపీ నేత బానుక మల్లికార్జున్ అన్నారు. రెండ్రోజులుగా తాము ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు విచారణ చేపట్టి, బోగస్ ఓట్లను తొలగిస్తుండటం హర్షణీయమన్నారు. కొత్తగా ఓట్లు నమోదు చేయాల్సిందిగా కొందరు యజమానులు స్థానిక నేతలకు తమ ఇంటి చిరునామాతో కూడిన దరఖాస్తులు ఇస్తే, వాటిని దుర్వినియోగం చేసినట్లు తేలిందన్నారు. అధికారులు బోగస్ ఓట్లను పూర్తిగా తొలగిస్తేనే ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుంటుందన్నారు.



రహదారి మధ్యలోనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారిలా..

అంగడిలో అడుగు పెట్టలేం !

సమస్యల సుడిగుండంలో మోండా మార్కెట్

- గతుకుల రోడ్లు, శిథిలావుతున్న భవనాలు
- దృష్టి సారించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

బన్సీలాల్‌పేట్: సుప్రసిద్ధమైన సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమస్యలతో సతమతమవుతోంది. అస్తవ్యస్తమైన వ్యాపార కార్యకలాపాలు, తూకాల్లో మోసాలు, రాకపోకల్లో తలెత్తే ఇక్కట్లతో అక్కడికొచ్చే వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీనత మార్కెట్‌కు గుదిబండగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతమెంతో ఘన చరిత్ర కలిగిన మార్కెట్ సమస్యలతో ఉక్కిబిక్కిరి అవుతోంది. ఓ వైపు శిథిలామవుతున్న భవనాలు, గతుకుల రోడ్లతో వ్యాపారులు, ప్రజలకు ఇక్కట్లు పడుతున్నారు. మోండా మార్కెట్ మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామనే పాలకుల మాటలు కోటలు దాటాయి కానీ.. ఆచరణ మాత్రంగడపదాటడం లేదనేది ఇక్కడ స్పష్టంగా కన్పిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోందని కొనుగోలుదారులు వాపోతున్నారు.

పార్కింగ్ లేక రోడ్లపైనే వాహనాలు..

మోండా మార్కెట్‌లో గతుకుల రహదారుల మీదుగా రాకపోకలు సాగించడం కష్టతరంగా మారుతుంది. ముఖ్యంగా ఇక్కడి వ్యాపార కార్యాకలాపాలపై జీహెచ్‌ఎంసీ నియంత్రణ లేకపోవడంతో కర్ర ఉన్నవాడిదే బర్రె అన్నచందంగా తయారైయింది. మోండా మార్కెట్‌లో హోల్‌సెల్ వ్యాపార కార్యకలాపాలు బోయిన్‌పల్లికి తరలిపోవడంతో ఇక్కడ కేవలం రిటైల్ వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయి. దుకాణాల ఏర్పాటుకు క్రమపద్ధతి లేకపోవడంతో ఎక్కడ పడితే విక్రయిస్తుండటంతో కోనుగోలు చేయడానికి వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మధ్యతో కూడా దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో కనీసం నడిచేందుకు బాటలేక ఇబ్బందులు పడుతున్నామని కొనుగోలుదారులు వాపోతున్నారు. కొందరు దుకాణాదారులు ధరలు తూకాల విషయంలో నియమాలు పాటించడం లేదు. మార్కెట్‌కు వచ్చే వారికి సరైన విధంగా పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో అక్కడికొచ్చే వారు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు ఫొటోలు తీసి చలాన్లు వేస్తున్నారని పలువురు వాపోయారు.

వేసవిలో దాహం దాహం..

వేసవిలో నీటి ఎద్దడితో ఇటు వ్యాపారులు, ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోండా మార్కెట్‌లో పశువుల సంచారం తీవ్రంగా ఉంది. ఎక్కడ ఎవరిపై దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం మార్కెట్‌లో పశువులు సంచరిస్తున్నా జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోండా మార్కెట్‌లో పశువులు పొడవడంతో ఓ వ్యక్తి ప్రాణాలు సైతం కోల్పోయాడు. రాత్రి వేళల్లో మోండా మార్కెట్ తాగుబోతులకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. మార్కెట్ విషయంలో ఇటు ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్

సనత్‌నగర్: నిరుపేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్లావుద్దీన్ కోఠిలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే ఆర్థికంగా మోయలేని భారంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తరచూ నిరుపేదలు ఎక్కువగా ఉండే బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తే ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ నితిన్, డాక్టర్ శాంతన్, డాక్టర్ హారిక, డాక్టర్ అప్సాల, నాయకులు కొలను బాల్‌రెడ్డి, సరాఫ్ సంతోష్, అల్లావుద్దీన్ కోఠి బస్తీ అధ్యక్షుడు కరీంలాల్, ప్రధాన కార్యదర్శి అష్రఫ్, సయ్యద్‌ఖాన్, తైసేమ్‌ఖాన్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



రేషన్ దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత రేషన్ దుకాణం నిర్వాహకులపై ఉందని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం అడ్డగుట్టలోని పలు రేషన్ షాపుల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆమె పాల్గొని ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారిని సరస్వతి, ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్, నాయకులు ఇస్మాయిల్, గౌస్, మోహన్, వడ్లూరి రవి, గోపి పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లతో అప్రమత్తంగా ఉండాలి



బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్: నగరంలో ఇటీవల వైరల్ జ్వరాలు పెరిగిపోతున్నాయని అప్రమత్తంగా ఉండాలని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక సూచించారు. బుధవారం ఆమె డివిజన్‌లోని నాలాబజార్ బస్తీ దవాఖానాను సందర్శించి డాక్టర్ ప్రత్యూషతో మాట్లాడారు. వైరల్ ఫీవర్లు పెరుగుతున్న తరుణంలో ప్రజలకు తగిన సూచనలు సలహాలు అందించాలని సూచించారు. అలాగే ఇక్కడ తగిన సిబ్బంది, అవసరమైన మందులపై ఆరా తీశారు. ఇక్కడ మంచి వైద్య సేవలు అందిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే భారం తగ్గుతుందని చెప్పారు.

◆ అనంతరం ఆమె పౌర సరఫరా అధికారులతో కలిసి దీపిక శివాజీనగర్, చాపలబావిలోని రేషన్ దుకాణాల్లో జరిగిన సోషల్ ఆడిట్‌లో పాల్గొని డీలర్లతో చర్చించారు. వినియోగదారులకు సరైన సమయంలో సరుకులు అందించాలన్నారు. ఆమె వెంట ఏఎస్‌వో చాముండేశ్వరి, ఇన్‌స్పెక్టర్లు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



రెండవ వార్డులో పర్యటిస్తున్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: నాలుగేళ్ల క్రితం ఓటు హక్కులేని బస్తీల్లో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టానని ఓటు హక్కుతో సంబంధం లేకుండా అందరికి అందుబాటులో ఉంటానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు 2వ వార్డు రసూల్‌పురాలోని అన్నానగర్, అర్జున్‌నగర్, సీబీఎస్‌నగర్, పోచమ్మ టెంపుల్, తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు లేని బస్తీల ప్రజలను కలిసి వారికి భరోసా ఇచ్చానని వారికి అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, జబ్బార్, మణికంఠ. కరీం, ఇలియాజ్, మజార్, తౌఫిక్ జూయనిర్ జబ్బార్, నాగరాజు, దొబ్బ శ్రీను పాల్గొన్నారు.

ఓయూలో కాన్షీరాం జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం 89వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కాన్షీరాం చిత్రపటానికి పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ నివాళి అర్పించి బహుజన రాజ్యాధికారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంజయ్, తిరుపతి, రాముయాదవ్, వెంకన్నగౌడ్, కిషన్‌నాయక్, అంజి, సత్యం, ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి రిమాండ్

సికింద్రాబాద్: బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన షేక్ సలీం అలియాస్ ఇమ్రాన్(32) ఐదేళ్ల క్రితం నగరానికి వచ్చి నాంపల్లిలోని కూలీల అడ్డాల వద్ద ఉంటున్నాడు. 2019లో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి నగదు చోరీ కేసులో అరెస్ట్ అయ్యాడు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం బైరారం గ్రామానికి చెందిన గురునాగం నెల రోజుల క్రితం తన ఐదేళ్ల కుమార్తెతో కలిసి నగరానికి వచ్చి మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 13న సొంతూరుకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తన కుమార్తెతో వచ్చాడు. అతిగా మద్యం తాగి ఉన్న అతను 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిద్రపోయాడు. నాంపల్లికి వెళ్లేందుకు అదే రోజు రాత్రి 11.30 గంటలకు షేక్ సలీం మద్యం తాగి స్టేషన్‌కు వచ్చాడు. అదే సమయంలో ఐదేళ్ల పాప అతడి కంటపడడంతో చాక్లెట్లు ఇప్పిస్తానని తీసుకొని ఎంఎంటీఎస్‌లో లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఎలాగైనా పోలీసులకు దొరికిపోతానని గుర్తించిన నిందితుడు తానే బాలికను లింగంపల్లిలోని ఆర్పీఎఫ్ పోలీసులకు అప్పగించి వెళ్లిపోయాడు.

పనులు చేసేందుకు పదవులే అక్కర్లేదు



పవర్ బోర్‌వెల్ సమస్యపై స్థానికులతో చర్చిస్తున్న నళిని కిరణ్

కంటోన్మెంట్: ప్రజా సమస్యలు తీర్చేందుకు పదవులే అక్కర్లేదని బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ అన్నారు. పికెట్ లక్ష్మీనగర్‌లో పవర్ బోర్‌వెల్ పనిచేయడం లేదని స్థానికులు సమాచారం ఇవ్వడంతో, వెంటనే బోర్డు అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరింపజేచారు. అనంతరం వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తన తండ్రి వెంకట్రావు, 2015 నుంచి తాను ప్రాతినిధ్యం వహించిన నాలుగో వార్డులో అనేక సమస్యలను పరిష్కరించానన్నారు. రాబోయే రోజుల్లో నాలుగో వార్డులోని అన్ని కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట దశరత్‌రెడ్డి, పనస శ్రీకాంత్, సబిత ఉన్నారు.

సైన్స్ మహాసభ విజయవంతం



మహాసభలో పాల్గొన్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో నిర్వహించిన సైన్స్ మొదటి మహాసభ విజయవంతమైందని స్టేట్ చాప్టర్ ప్రతినిధి ఎ.ప్రతిభ తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలోని 57వ తరగతి గదిలో జరిగిన మహాసభకు వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు.

◆ ఈ సందర్భంగా బ్రేక్ త్రు సైన్స్ సొసైటీ తెలంగాణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు డా.గంగాధర్, ఉపాధ్యక్షులు దేవర్షి గంగాజీ, డా.వికాస్ శర్మ, డా.నతనియల్, కార్యదర్శిగా శరత్, కోశాధికారిగా ఉషాకిరణ్, ఆఫీస్ సెక్రటరీగా సాయికుమార్ ఎంపికయ్యారు.

పనికి కూలీలను పంపుతానని మోసం

ఆన్‌లైన్‌లో రూ.21,500 కాజేసిన గుర్తు తెలియని వ్యక్తి

అమీర్‌పేట: కంపెనీలో పనిచేసేందుకు కూలీలను పంపుతానని ఓ వ్యక్తి రూ. 21,500 దండుకున్న ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెక్‌కాలనీలో ఉండే సయాన శ్రీనివాస్‌రావుకు పాశ మైలారంలో గాయత్రీ ప్యాకేజీ కంపెనీ ఉంది. అతడికి ఈ నెల 11న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. లేబర్ కాంట్రాక్టర్‌గా పరిచయం చేసుకుని ఒరిస్సాలో ఏడు మంది లేబర్లు ఉన్నారని కావాలంటే పంపుతానన్నాడు. అయితే అడ్వాన్స్ కింద రూ.18 వేలు చెల్లించాలని చెప్పడంతో శ్రీనివాస్‌రావు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించాడు. వచ్చేటప్పుడు రైలులో ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారని తమ వద్ద ఆధార్ కార్డులు కూడా లేవని రైలు శబ్దాన్ని వినిపించడంతో పాటు ఆర్‌పీఎఫ్ పోలీసులు మాట్లాడినట్టు ఫోన్‌లో మాట్లాడించి మళ్లీ రూ.3.500 వేయించుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీలో జరిగిన ఘటనపై ఓయూలో నిరుద్యోగులు, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. బుధవారం నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ చేపట్టి రోడ్డుపై ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, జాతీయ నాయకులు నాగేశ్వర్‌రావు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించి, సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళ మృతికి వైద్యులు కారణమంటూ ధర్నా



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు



రాణి (ఫైల్)

అమీర్‌పేట: వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్ సంతోష్‌గిరికి చెందిన రాణి (22) ప్రసవం కోసం ఈ నెల 13న మోతీనగర్‌లోని సన్‌రిడ్జ్ ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు రాగారెడ్డి సూచనల మేరకు చేర్చుకుని సిజరిన్ చేయాలని తెలిపి మరుసటి రోజు సిజరిన్ చేయగా రాణి కవలలకు (ఆడపిల్లలు) జన్మనిచ్చింది. రక్తస్రావం ఆగకపోవడంతో రాణి ఆరోగ్య పరిస్థితి విషమించింది. రోగికి వెంటనే డయాలసిస్ చేయాలని చెప్పి రాత్రి 11 గంటలకు కాచిగూడలోని టీఎక్స్ ఆస్పత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు రోగికి డయాలసిస్ అవసరం లేదని, సిజరిన్ సరిగా చేయని కారణంగా అధిక రక్త స్రావం అవుతుండడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని మెరుగైన వైద్యం కోసం ఉప్పల్‌లోని టీఎక్స్ బ్రాంచికి తీసుకుళ్లాలని సూచించారు. బుధవారం తెల్లవారు జామున ఉప్పల్ ఆసుపత్రికి తరలించే క్రమంలో రాణి మృతి చెందింది.

ఆస్పత్రి ఎదుట ఆందోళన..

వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని రాణి భర్త దీపక్ కుటుంబ సభ్యులతో కలిసి మృతదేహంతో ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు. పుట్టిన ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు షురూ

ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సనత్‌నగర్, సికింద్రాబాద్ ఎస్‌ఆర్‌నగర్, బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాల్లోని కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది. కొన్ని కేంద్రాల చిరునామాలు విద్యార్థులకు తెలియకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వారిని ఆటోలలో ఆయా కేంద్రాలకు తరలించి శభాష్ అనిపించుకున్నారు.

– సనత్‌నగర్/పద్మారావునగర్/చిలకలగూడ



సీతాఫల్‌మండి కేంద్రం వద్ద విద్యార్థులు, కుటుంబ సభ్యులు



పద్మారావునగర్‌లోని సెంటర్ వద్ద ..



పరీక్షా కేంద్రం చిరునామా చెబుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



పరీక్ష కేంద్రం తెలియకపోవడంతో ఆటోలో విద్యార్థులను తీసుకొచ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్

కంటి వెలుగు కేంద్రం మార్పు

అడ్డగుట్ట: మారేడుపల్లిలోని విజ్ఞాన జ్యోతి డిగ్రీ కాలేజీలో నేడు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సాయి శంకర్ తెలిపారు. ఇది వరకు బోయబస్తీలోని కమ్యూనిటీహాల్లో కొనసాగిన కేంద్రాన్ని విజ్ఞాన జ్యోతి కాలేజీకి తాత్కాలికంగా మారుస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి అభివృద్ధి పనులపై సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని కుట్టి వెళ్లోడి ఆస్పత్రిలో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సక్కుబాయి ఆధ్వర్యంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కార్పొరేటర్ సామల హేమ కుట్టి వెళ్లోడి ఆస్పత్రి, చిలకలగూడలోని యూపీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పనులు.. వాటికి కావాల్సిన పరికరాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, పాని, సూపర్‌వైజర్ విజయరాణి పాల్గొన్నారు.